# ఈడొచ్చిన కథ

విమలా, మోహన్ ప్రేమించుకున్నారు.

*　　　*　　　*

మగవాళ్ళకన్నా, ఆడవాళ్ళకు సంప్రదాలయామీదా, ఆచారాలమీదా శ్రద్ధాసక్తులు అధికంగా ఉంటాయని, అప్పుడెప్పుడో చదివాను. ఆ వాక్యం చదివినప్పుడు, నేనేమను కొన్నానో ఇప్పుడు జ్ఞాపకంలేదు. కాని జీవితంలో కొంత దూరం ప్రయాణాం చేశాక, అనేక అనుభవాలు రుచి చూశాక, ఆ వాక్యంలోని సత్యం కొంచెం కొంచెం అవగాహన అవుతోంది. నాగరిక ప్రపంచంలోని, ఏ కొద్ది మందినో చూసి, ఆడవాళ్ళు త్వరగా మారిపోతున్నారనుకోవడం పాక్షిక సత్యమే అవుతుందిగాని, పూర్తి సత్యం కాదు. ఈ ఆడవాళ్ళయినా - వేషాల్లోనూ, భాషలోనూ మారారేగాని, మౌలికమైన పరిణామం చెందినట్లు నాకనిపించడంలేదు. ఏ ఒకరిద్దరి సంగతో కాదు, నేను చెప్పడం !

పురాతనమైన భూ॰ లు, ఆచారాలు, వస్తువులు వీటి పట్ల మగవారికన్నా ఆడవారికే మోజు హెచ్చు. తన పెళ్ళి నాడు పెట్టుకొన్న రాగిడి చంద్రవంకను, మా నాయనమ్మ గారు ఇప్పటికీ తన సందుగు పెట్టెలో భద్రంగా దాచు కొన్నది. మా తాతగారి వడుగు జంధ్యం - వెండిది - ఈ నాటికీ మా ఇంట్లో ఉన్నది. అత్తగారి ఆరళ్ళు భరించలేక, పమిడమ్మ బావిలో దూకి ఆత్మహత్య చేసుకొన్న మా మరో నాయనమ్మ తాలూకు బులాకీని, ఇప్పటికీ మేము ప్రాణప్రదంగా దాచుకొంటున్నాం. దాచుకొంటున్నా మంటే, మేమేదో దానికోసం పనిమాలా ప్రాకులాడుతున్నా మని కాదు! మా అమ్మ వాటిని దాచింది. ఇప్పుడా శాఖను మా ఆవిడ చూస్తూవుంది.

కాలం గడిచినకొద్దీ ఈ దాయడంలో కొన్ని మార్పులు, చేర్పులు కూడా చేరాయి. ఒకప్పుడు మేమూ అంతో ఇంతో ఆస్తిపాస్తులున్న వాళ్ళం కావడం మూలాన, పాతకాలపు సొమ్ములు దాయడానికి సందుగుపెట్టె ఉప యోగపడేది. నా హయాం వచ్చేసరికి, అంతా కరిగిపోయి రేకులు మాత్రం మిగిలాయి. పెట్టె ఖాళీగా ఉండడం చూసినప్పుడల్లా, గతంలోని జ్ఞాపకాలు చెలరేగి మనస్సును కకావికలు చేస్తూ వుండేవి. ఇప్పుడా పెట్టెలో పనికొచ్చేవీ, పనికిరానివీ కాగితాలు చూస్తూ వున్నాం. ఏమీ తోచక, ఆ కాగితాల కుప్పను ముందేసు కూర్చున్నాను. కొన్ని

ముట్టుకొంటే పొడుం పొడుం అయిపోతున్నాయి. కొన్నింటిని బొజ్జింకలు పిండికింద తినేశాయి. వీరేశలింగంగారి దస్తూరితో మా తాతగారికొచ్చిన కార్డొకటి కనిపించితే తీసి దాచాను. వివిధ మత సమ్మేళనానికి మీావూరొస్తున్నాననీ, మీా ఇంట్లోనే దిగుతాననీ, త్రిపురనేని రామస్వామిచౌదరి గారు, మా నాన్నకు వ్రాసిన ఉత్తరం ఒకటి కనిపించింది. దాన్ని సుబ్బారావుకిద్దామని తీసి దాచాను. కొండా వెంకటప్పయ్యగారు ఉపన్యాసం ఇవ్వడానికిగాను, వ్రాసుకొన్న పాయింట్సున్న కాగితం మరొకటి దొరికింది. వీటిని పారేయడానికి బుద్ధి పుట్టదు; ఉంచేందుకు చోటులేదు.

ఆకుపచ్చ సిరా మరకలతో మరో కాగితం కనిపించింది. దాన్ని చూస్తూనే రవ్వంత ఆశ్చర్య పోయాను. మా యింట్లో ఆకుపచ్చ సిరా వాడేవాణ్ని నేనొక్కణ్నే! అదీ ఇరవై ఏళ్ళకిందటిమాట! ఆరోజుల్లో నేను ఆకుపచ్చ సిరాతోనే అన్నీ వ్రాసేవాణ్ణి! ఎందుకని అడక్కండి. అదో సరదా!

చిన్నప్పటి ఫొటోను చూసినప్పుడు కలిగే భావాల్లాంటివే నాలోనూ కలిగాయి. మడతలు విప్పి చూశాను. దానిమీాద వొకే వొక వాక్యం రాసిఉంది, "విమలా-మోహన్ ప్రేమించు కొన్నారు" అని.

—అంటే అప్పట్లో అదొక కథకు ప్రారంభ వాక్యమన్నమాట. ఆ తరవాత నేనేమి రాయదలచుకున్నానో,

యెందుకు రాయలేదో నా కిప్పుడేమీ జ్ఞాపకంలేదు. తీరా కథ రాయబోయేసరికి; కాగితాలు ఉండకపోవడమో, కలంలో సిరా అయిపోవడమో, లేదా రామచంద్రం గుంటూరు ప్రయాణం కట్టడమో జరిగి ఉండాలి. కొల్లూరు వెంకటేశ్వర్లు గారు ఏ మీటింగుకన్నా పోతూ రమ్మని పిలిచి ఉండాలి. బెల్లంకొండ నారాయణ, గుడ్డలకొట్లో కూచోమని చెప్పి వుండాలి. శివరామకృష్ణయ్యగారు, మఠం దగ్గరికి తీసుకుపోయి వుండాలి. అదేదో జరిగే వుంటుంది. కాకపోతే, ప్రారంభించి ముగించకుండా విడిచిపెట్టిన కథలేవీ ఉన్న జ్ఞాపకం నాకు లేదు.

రెండు దశాబ్దాల తరువాత కనిపించిన ఆ కథను చూస్తుంటే ప్రాణంలేచివచ్చి నట్లయింది. ఆ రోజుల్లో నా దస్తూరి చాలా ముచ్చటగా వుండేది. అలా రాయడం ఇప్పుడు నావల్లనే కాదు.

ఎంత ప్రయత్నించినా, ఆ వాక్యం తరువాత నేను రాయదలుచుకొన్న వాక్యం — పోనీ, రాసివుండే వాడి నను కొంటున్న వాక్యం నాకు స్ఫురించలేదు. కానీ కథను ఆ వాక్యంతో ప్రారంభించడానికి ఇప్పుడైతే నాకు చాలా అభ్యంతరా లున్నాయి. అసలీ విమల ఎవరు ? ఈ మోహన్ గాడెవడు ? వీళ్ళిద్దరి కథా కమామిషూ ఏమిటి ? ప్రేమించు కోవడానికి వీళ్ళచుట్టూ ఉన్న పరిస్థితులేమిటి ? ఏ ఆంతరిక ప్రేరణలు, బాహ్య వాతావరణం వీరిని ప్రేమించుకొనేలా

చేశాయి! అసలు ప్రేమేమిటి ప్రేమ? వాళ్ళ బొంద! ఇలాంటి సవాలక్ష ప్రశ్నలు—నా చుట్టూ ముసిరేవి. వీటన్నింటినీ నేను కథలో ఇముడ్చలేకపోవచ్చు. వీటిని గురించి చర్చించే అవసరం కూడా రాకపోవచ్చును. కానీ ఇవన్నీ ఈనాడు నాకు తెలిసి వుండాలి. వీటికి నేను సంతృప్తికరమైన సమాధానం చెప్పగలిగి వుండాలి.

అయితే ఈ మధ్య నేను అడపా దడపా రాస్తూన్న కథల్లో ఇవన్నీ ఉన్నాయా అని అడక్కండి. ఉండడం అవసర మని మాత్రమే నేను మనవి చేస్తున్నాను. ఇవే పాత్రలను తీసుకొని, ఈనాడు కథరాస్తే యెలా వుంటుంది ?

"విమలా, మోహన్ ప్రేమించుకున్నారు" అనడం తోనే చాలా కథ నేను చెప్పేశాను. నిజానికి ఈ వాక్యం కథాంతాన వుండాలిగాని, ప్రారంభంలో కాదు. వా రిద్దరూ ప్రేమించుకోవడంతో కథ ముగిసిపోయిందని నా అభిప్రాయం. ఇప్పుడయితే ఆ కథను యిలా రాస్తాను.

◆ ◆ ◆

మాటవరసకి, శివరామయ్య అనే పెద్దమనిషిని తీసు కుందాం. అయితే ఇది శివరామయ్య కథ మటుకు కాదు. ఇది అతని కూతురు విమల కథ. విమలకథ తెలుసుకునేముందు శివ రామయ్య సంగతి తెలుసుకోవడం కొద్దిగా ముఖ్యం. ఎందు కంటే శివరామయ్య వ్యవహారం చిన్నతనంనుంచీ యింకొక లాగ వుంటే విమల కథ ఈ విధంగా వుండేది కాదు.

శివరామయ్య ఆ రోజుల్లోనే అభ్యుదయవాది కింద జమ. అప్పట్లో ఆయన్ని "జస్టిస్ పార్టీ ముండాకొడుకు" అనే వాళ్ళుకూడా లేకపోలేదు. అనటానికేం?

శివరామయ్య తండ్రి చేసేది కరిణీకమే అయినా ఒక జమీందారు వెలుగు వెలిగినవాడే. ఎవరో జమీందారుని ఆశ్రయించి, "చేతి చలవ" తో తనే జమీందా రంతటి వాడైనవాడు.

తండ్రి పోయేదాకా శివరామయ్యకు తండ్రి వ్యవహారమేమీ తెలీదు. ఆపైన తాళాలు తన చేతికొచ్చాయి. ఇంతో అంతో దేశభక్తి ఉన్నవాడు. ఆ గ్రామానికి "గాంధీ"గారి పేరు తీసుకొచ్చినవాడు. కాంగ్రెసు జెండా అందరికీ మొదటిసారి చూపెట్టిన వాడు. సహాయ నిరాకరణంలో పాల్గొన్నాడు. విదేశీసరుకు బహిష్కరించాడు. సిల్కుబట్టలూ అవీ తగలబెట్టేశాడు. పట్టాభిగార్ని, ప్రకాశంగార్ని రప్పించాడు. ఉపన్యాసా లిప్పించాడు. హరిజనవాడల్లో తిరిగాడు. వాళ్ళను యింటికి తెచ్చి సహపంక్తి తిండిపెట్టాడు.

రాజకీయ నాయకుల జాబితాలో శివరామయ్య పేరెక్కింది. ఇంకో రెండేళ్ళకు స్వతంత్రం వస్తుందనగా యావదాస్తి, "దేశంకోసం" ధారాదత్తమయింది. అనగా ఉన్న దంతా ఊడ్చుకుపోయింది.

స్వరాజ్యం కోసం ఎదురు చూసిన శివరామయ్య కలలన్నీ కరిగిపోవడానికి అయిదేళ్ళు పట్టింది. అధికారం

కోసం, పదవులకోసం జరిగే కుమ్ములాటలలో ఒకప్పుడు రాజకీయ నాయకుడుగా చెలామణి అయిన శివరామయ్య అజాపజా లేకుండా పోయాడు.

“ఫలానావారు పలానా పదవిలో వున్నారు. ఏదైనా సాయం చేయొచ్చు. వెళ్ళండి” అన్నారు కొందరు-శ్రేయోభిలాషులు. మొదట్లో మనస్కరించకున్నా, చివరికి అదీ చూశాడు. ప్రయోజనం లేదనిపించుకున్నాడు.

ఒకరకంగా, తిండికూడా మాడి చావవలసిన శివరామయ్యను, అతనిభార్య ఆదుకుందంటే తప్పులేదు. ఇంత ఉన్నప్పుడు ఆమె అంతో ఇంతో జాగ్రత్తపడింది. ఆ డబ్బుతో కూతుర్ని బాగా చదివించాలని ఆవిడ సంకల్పం. చదువు కొన్న పిల్లలకు తొందరగా సంబంధాలొస్తాయి. కట్నాల కోసం అంత పట్టింపులుండవు. అదీగాక అతగాడి కిష్టమయితే మొగుడూ పెళ్ళాలిద్దరూ ఉద్యోగాలు చేసుకోవచ్చు. చెరి నాలుగురాళ్ళు తెచ్చుకొంటే సంసారం గుట్టుచప్పుడు కాకుండా వెళ్ళమారిపోతుంది.

శివరామయ్య అనుకొన్నవేవీ జరగనట్లే ఆవిడ అనుకొన్నవీ జరగలేదు. తను పై చదువులకు పట్నం పోనన్నది విమల. అరకొరగా చదవడంకన్న, అసలు మానుకోవడమే మంచిదన్నది.

“చాలామందిని చూస్తున్నాంగదా ? బియ్యేలు చదివిన వాళ్ళుకూడా - యాభైకీ, అరవైకీ గుమాస్తాలుగా పని

చేస్తున్నారు. చదువుకూడ లాభసాటైన పెట్టుబడే ననుకొంటే కొద్దిపెట్టుబడితో ఎక్కువలాభం వచ్చే పద్ధతేదో ఆలోచించాలి" అన్నది విమల.

ఆవిడ అన్నంత పనీ చేసింది.

అదేదో సమితిలో టీచరు పోస్టులు పది ఖాళీలున్నాయని తెలిసి దరఖాస్తు పంపించింది. ఇంటర్వ్యూ వస్తుందని విమల అనుకొన్నది గానీ, తనను సెలక్టు చేస్తారని మాత్రం అనుకోలేదు. ఎలా చేస్తారు ? సమితి ప్రెసిడెంటు కులంవేరు, తన కులం వేరు. అదీగాక ఆయన గ్రూపువాళ్ళే ట్రైనింగయి ఉద్యోగాల్లేకుండా ఉన్నవాళ్ళు పాతిక మందిదాకా వున్నప్పుడు, తను సెలెక్టు కావడం కల్లోమాట!

అయినా పోయి చూదామనుకొన్నది; వెళ్ళింది. ప్రెసిడెంటుగారు విమలను ఆపాదమస్తకం గుచ్చి గుచ్చిచూశాడు.

"నిన్ను సెలెక్టు చేస్తామనికాదుగానీ, చేయడమంటూ జరిగితే, అణకువగా పనిచేయాలి. పైవాళ్ళ మాటల్ని వినాలి. వాళ్లు చెప్పినట్లు చేయాలి" అన్నాడు ప్రెసిడెంటు సన్నగా నవ్వుతూ.

"అలాగేనండి" అన్నది విమల.

ప్రెసిడెంటు సాభిప్రాయంగా బి.డి.ఓ. వేపు చూశాడు. అతగాడు విమల పేరు దగ్గర పెన్సిల్‌తో గుర్తుపెట్టి, తరవాత తెలియపరుస్తామనీ, వెళ్ళిరమ్మనీ విమలను పంపేశాడు.

ఆ ఉద్యోగంమీద విమల బొత్తిగా ఆశపెట్టుకోలేదు. అది రాదని పదే పదే అనిపించినా, "వస్తేనే బాగుండిపోను" అనుకొన్న దావిడ.

"అందరం కట్టగట్టుకొని మాడి చావకుండా గంజో, గటకో యింత తాగవచ్చు. భగవంతుడేం చేస్తాడో ఏమో!" అన్నది తల్లితో.

మూడోవారం దాటకుండానే విమలకు ఉద్యోగం వచ్చింది. అదేదో అప్పాపురమట. అక్కడ వేశారు. విమల ఆలస్యం చేయలేదు. రోజు గడిస్తే వచ్చిన ఉద్యోగం కాస్తా జారిపోతుందేమో నన్న బిడియంకూడా ఆవిణ్ణి పట్టుకొన్నది. ఉన్నంతలో మంచి చీర కట్టుకొని, మిగిలిన వాటిని పాత ట్రంకులో సర్దుకొని, విమల బయల్దేరింది.

ఆవిడ జీవితంలో కష్టాలు ప్రారంభం కావడానికి అదే మొదలు.

ఆవిడ జాయినయిన వారం రోజులకు ప్రెసిడెంటుగా రొచ్చారు. టీచర్లందరూ వెళ్ళి ఆయనకు కనిపించారు. అందరితోపాటు విమలకూడా వెళ్ళింది.

విమలను చూస్తూనే అతను నవ్వాడు.

"అబ్బో అబ్బో! నీ పోస్టుకోసం చాలా బాధపడాలి సొచ్చింది. మిగిలిన వాళ్ళందరూ నీకివ్వడానికి వీల్లేదన్నారు. పాపం మంచిపిల్లవుగదా, చబితే వింటావుగాదాని, నీ కోసం

పట్టుబట్టాను... ఇక్కడ కులాసాగా ఉందిగదా! నువ్వు స్కూల్లోనే ఉంటున్నట్టు విన్నానులే! సరే వెళ్లు, కలుద్దాం!" అన్నాడాయన.

ఆయన చుట్టూ ఉన్నవారు, తనవేపు ఎందుకలా నవ్వుతూ చూస్తున్నదీ విమలకు అర్థం కాలేదు. దాని అర్థం ఆ రాత్రి దాటాకగానీ ఆవిడకు బోధపడింది కాదు.

స్కూలు కాపలా కాస్తున్న చాకలి, తనకేదో వస్తున్న దంటూ వెళ్ళిపోయాడు. మంగమ్మ, ఊళ్ళోకి పోయొస్తానని, వెళ్ళిపోయింది. అంత స్కూల్లోనూ – తనొక్కతే బిక్కు-బిక్కు-మంటూ వరండాలో కూచుని వున్నది.

ముందుగా సెంటు వాసనా, ఆ తరువాత అడుగుల చప్పుడూ, ఆ దరిమిలా ప్రెసిడెంటుగారూ ప్రత్యక్షమయినందుకు విమల ఆశ్చర్యపోయింది. ఆయన్ను చూస్తూనే విమల లేచి నిలబడింది. ప్రెసిడెంటుగారు విశాలంగా నవ్వుతూ, తను కూచుని ఆవిడ్ని కూడా మరో కుర్చీ తెచ్చుకోమన్నాడు–

"ఫర్వాలేదు లెండి" అన్నది విమల.

"అదేం కుదరదు. ముందు నువ్వు కూచోవాలి. లేకపోతే, నేనే కూచోబెట్టాలి సొస్తుంది."

విమలకు ఏమీ పాలుపోలేదు.

"ఏదీ నీగది చూద్దాం పద!" అన్నాడు ప్రెసిడెంటు ఓ నిమిషమయ్యాక.

విమలకు గత్యంతరం లేకపోయింది. ఆవిడ మనస్సులో చెప్పరాని భయమేదో మోసులెత్తింది. గొళ్ళెం తీసి, రెండు రెక్కలూ తోసి, లోపలికి చేయిచూపుతూ, ఏదో అనబోయి మానేసింది.

“నీకేం ఫర్వాలేదులే. అంతా నే జూసుకుంటాలే. నిన్ను టౌనుకు దగ్గరగా యేస్తాలే,” అంటూనే విమలచెయ్యి పట్టుకొన్నాడు.

కెవ్వున కేక పెట్టాలని ఆవిడ అనుకున్నది. కాని గొంతు పెగిలి రాలేదు. బలాన్నంతా పుంజుకొని, అతని చేతిని విదిలించి పారేసింది! బయట ఎవరో వస్తున్నట్టు అలికిడి గూడా అయింది.

“అబ్బో అబ్బో! శానా బెదురుమీదున్నావే! ఇట్టాంటివాళ్ళను సవాలక్షమందిని చూశాను. మర్యాదంటే ఇదేనా! నీకు ఉద్యోగమిచ్చింది ఎందుకనుకున్నావ్! చెప్పినమాట వింటానన్నావుగదా! ఏదీ? నే నింకా రెండు రోజులుంటాను. ఆలోచించుకో!” అన్నాడు ప్రెసిడెంటు—

ముందుగా ప్రెసిడెంటు, ఆ తరువాత అడుగుల చప్పుడూ, ఆ వెనక సెంటువాసనా మాయమయ్యాయి.

విమలకు ముచ్చెమటలు పోశాయి. కాళ్ళల్లోనుండి కుదుపువచ్చి చలించిపోయింది. గట్టిగా ఏడ్చే వోపికక్కూడా లేక, గోడకు జారగిలబడింది!

ఆ మర్నాడు స్కూలుకు సెలవు. కాపలావాడు

తప్ప, మంగమ్మకూడా రాదు. స్కూలు చూద్దామా, ఊరికి దూరంగా ఉన్నది. చుట్టూరా పొలాలు, ఒకవేపున వాగు.

కాపలావాడి వెంట మరోకొత్తముఖాన్ని చూసి, విమల ఆశ్చర్యపోయింది.

అతను వస్తూనే నమస్కారం చేశాడు. తనపేరు చెప్పుకున్నాడు.

"వారం రోజుల్నించీ సెలవుమీద ఉన్నాను. నిన్న సాయంత్రమే వచ్చాను" అన్నాడు మోహన్.

విమల మాట్లాడలేదు.

"మీకు తెలీదేమోగానీ, మీ నాన్నగారు నాకు బాగా తెలుసు. ఆయన చాలాసార్లు మా ఇంటికొచ్చారు. నేనూ ఒకటి రెండుసార్లు మీ ఇంటికొచ్చాను" అన్నాడు మోహన్.

"అలాగా!" అన్నది విమల.

"మీ నాన్న బాగా చితికిపోయాడని విన్నాగానీ మీరు ఉద్యోగం చేస్తేతప్ప వీల్లేనంతగా చితికిపోయాడనుకోలేదు ... సిగరెట్ కాలుస్తే మీ కభ్యంతరం లేదుగదా?"

"లే" దన్నది విమల, అతనికేసి తమాషాగా చూస్తూ.

మోహన్ సిగరెట్ కాల్చి అగ్గిపుల్లను దూరంగా గిరాటెట్టాడు.

"మీ రిక్కడికొస్తున్నట్లు నాకు ముందుగానే తెలుసు.

మీ కెందుకు ఉద్యోగం ఇచ్చిందీ నాకు తెలుసు. ముందుగా వచ్చి చెబుదామా అనుకున్నాను. మీరు క్షమిస్తానంటే యింకో మాటకూడా అందామని వున్నది.”

విమల కళ్లు విప్పార్చి చూస్తున్నది.

“అంటే చెప్పమన్నారని అర్థమన్నమాట. మరేం లేదు. అసలీ గొడవలన్నీ మీకు ముందే తెలుసునేమోనన్నీ, వీటన్నిటికీ అంగీకరించే మీరిక్కడి కొచ్చారని, నే ననుకొన్నాను. చెప్పొద్దూ; ప్రెసిడెంటు వస్తున్నాడని తెలిసి నిన్న సాయంత్రమే నేనొచ్చాను. వాడిగుణం నాకు తెలుసు. పరమ లత్కోరు ముండాకొడుకు. వాడు మీతో మాట్లాడుతున్నప్పుడు నేను ఆ గది చాటుగా ఉన్నాను. వాడి రోజులు మంచివి గనుక, ఏమీ చెయ్యకుండా వెళ్ళిపోయాడు. అవును గానండీ—మీ రెంత భయపడితే మాత్రం, గదిలో కెళ్ళి తలుపేసుకు పడుకుంటారా, వరండాలోనే వుంటారా? ఆ బద్మాష్ మళ్లా వస్తాడేమోనని, తెల్లవార్లూ నేను జాగారం చెయ్యలేక చచ్చాగదా!” అన్నాడు మోహన్.

విమలకు ఆశ్చర్యమూ, సంతోషమూ కూడా కలిగాయి.

“మనం మంచివాళ్ళ మయితేనే చాలదు. మనచుట్టూ వుండే వాతావరణంకూడా మంచిగా వుండాలి. ఈ అరణ్యం మధ్యనుండి నిన్ను ఊళ్ళోకి తీసుకుపోగలను కానీ, చూసిన వాళ్ళూరుకోరు. దురదృష్టం ఏమిటంటే, మిమ్మల్ని ఈ ఊరే

వెయ్యమన్నవాణ్ని కూడా నేనే... యెందుకో చెబుతాను. తెలిసినవాణ్ని నేనొకణ్ని వుంటాగదాని! ఇపుడు మిమ్మల్ని నా వెంట తీసుకెళ్లాననుకోండి, నలుగురూ ఏమనుకొంటారో మీకు తెలుసు... నేను బోర్ కొట్టడం లేదుగదా" అన్నాడు మోహన్.

"ఈ వారంలోనూ, నాతో ఇంతసేపూ మాట్లాడింది మీరొక్కరే" అన్నది విమల.

"అవును. మీరు ప్రెసిడెంటుగారి కాండిడేట్ గనుక— అలాగని వాళ్ళనుకొంటున్నారు గనుక—హడిలి ఛస్తున్నారు. తమమీద, ప్రెసిడెంటుతో ఏం చెబుతారోనని వాళ్ళభయం! అందుకే నోరు మూసుకున్నారు."

"ప్రెసిడెంటంటే మీకుమాత్రం భయంలేదా?" అన్నది విమల.

"లేదు. వీడిజుట్టు నా చేతుల్లో వున్నది. వీడు ప్రెసిడెంటు కావడానికి మా నాన్నగారే కారణం. వీణ్ణి యెన్నుకొన్నవాళ్ళలో సగానికి పైె చిల్లర మంది మా నాన్న ఏం చెబుతే అదే వినే జనం" అన్నాడతను. విమల ఏదో అనబోయింది.

"ఈపూట మిమ్మల్ని భోజనానికి తీసుకొస్తానని మా బామ్మతో చెప్పాను. మిమ్మల్ని అడక్కుంటా అలా అనడం తప్పేననుకోండి. బయల్దేరదామా?" అన్నాడు.

విమల గదికి తాళంవేసి, లాగిచూసి మరీ బయలు దేరింది.

ఆవిడ తిరిగి ఆ గదికిరానేలేదు; బామ్మగారు రానివ్వనూలేదు. మోహన్‌తో బాటు స్కూలుకెళ్ళి అతనితో బాటే తిరిగివచ్చేది.

ఒకసారి అతను అన్నం తింటున్నప్పుడు పోస్టుమాన్ ఉత్తరం తెచ్చిచ్చాడు.

"ఏమిటది? ఎక్కణ్నుంచీ?" అన్నాడు మోహన్.

విమల ఉత్తరం చించి, అతని పక్కనే వుంచబోయింది.

"ఫర్వాలేదు చదువు."

విమల చదివింది. అది అతని పెళ్ళికి సంబంధించిన వ్యవహారం.

చెయ్యి తుడుచుకొంటూ గదిలోకొచ్చి, విమలను పిలిచాడు. ఏం జవాబు రాయమంటా వన్నాడు.

విమల సన్నగా నవ్వింది.

"నవ్వితే జవాబిచ్చినట్లు కాదే !" అన్నాడు మోహన్.

"మీ పెళ్ళిని గురించి నన్నడిగితే ఏం చెప్పను ?" అన్నది విమల.

"అలా దారికి రా!" అన్నాడు మోహన్. "జాబు నువ్వూ చూశావుగదా! అందులో నా కిష్టమైన అమ్మా

యిని చేసుకోమని మా నాన్న స్పష్టంగా రాయనుకూడా రాశాడు."

"మరింకేం?" అన్నది విమల.

"నా గోడవేమిటంటే, నా యిష్టమొక్కటే సరిపోదని! నా కిష్టమైన పిల్లకు నన్ను పెళ్లాడడం ఇష్టమో కాదోకూడా నాకు తెలియడం అవసర మంటావా, కాదా?"

"తప్పకుండా అవసరమే!" అన్నది విమల.

"అలా అన్నదానివి జవాబు చెప్పమంటే చెప్పవేం? ఏం తీపర మొచ్చిందమ్మా?" అన్నాడు.

అతనన్న దేమిటో పావునిమిషం దాకా విమలకు అర్థంకాలేదు. తీరా అర్థమయిన తరువాత ఆవిడకళ్లు తళతళ లాడడం మోహన్ గమనించాడు.

"నీ కళ్ళే చెబుతున్నాయి. నాకు తెలుసుమరి. మీ నాన్నకూ ఓ జాబురాసి పడెయ్" అన్నాడు మోహన్.

విమలా, మోహన్ - ఒకరినొకరు గాఢంగా ప్రేమించు కొన్నారు.

*    *    *

అంతా వినిపించి,

"ఎలా ఉంది కథ" అన్నాను రంగనాథరావుగారితో.

ఆయన కాస్సేపు ఆలోచించారు. కళ్ళజోడుతీసి బల్ల మీద పెట్టారు. యాష్ట్రే వెదుక్కొని, అందులోకి సిగ

రెట్‌ను రాల్చారు. పాడి దగ్గు దగ్గి, గొంతు సరిచేసు కొన్నారు...

"ఈ కథ-" అంటూ ప్రారంభించాడు రంగనాథరావు.

"ఎలా వుంది? అని మీ ప్రశ్న!

వెనుకటికి కొడవటిగంటి కుటుంబరావుగారు, 'ప్రపంచ సరళి' అనే ఒక నవలకు, ఇచ్చిన అభిప్రాయం జ్ఞాపక మొస్తున్నది నాకు. 'ఈ నవలను నేనే ఎందుకు రాసి ఉండ కూడదూ?' అని వారనుకుంటున్నా రట. మీ కథ విన్నాక, సరిగ్గా నాకూ అదేభావం కలుగుతున్నది. స్వార్థచింత! ఏమంటారు?" అన్నాడు రంగనాథరావు.